వైఎస్ఆర్‌కు ఘన నివాళులు

విశ్వంభర, తిప్పర్తి : తిప్పర్తి మండలం కేంద్రంలో దివంగత మహా నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా. వైయస్ రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.కాంగ్రెస్ పార్టీ తిప్పర్తి మండల అధ్యక్షులు పాదూరి శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్ లు మాట్లాడుతూ పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన మహానేత వైయస్ఆర్ అని అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, 108, 104 వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ఆయన సేవలను గుర్తు చేస్తున్నయి అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ తిప్పర్తి మండల అధ్యక్షుడు బద్దం సుధీర్, మాజీ డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నల్గొండ జిల్లా అధికార ప్రతినిధి పాశం నరేష్ రెడ్డి , కల్లు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితాపై గ్రామ సభల పరిశీలన

ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి సమీక్ష

విశ్వంభర, సరూర్ నగర్ : ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా సరూర్‌నగర్ వార్డు కార్యాలయంలో నిర్వహిస్తున్న ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలన, గ్రామ సభలను కందుకూరు ఆర్డీఓ ఎన్. జగదీశ్వర్ రెడ్డి మండల తహసీల్దార్ పి.వేణుగోపాల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు చేపడుతున్న ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందా లేదా అనే విషయాన్ని ప్రజలు పరిశీలించుకోవాలని, ఏమైనా అభ్యంతరాలు, మార్పులు లేదా చేర్పులు అవసరమైతే సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆర్డీఓ సూచించారు. గ్రామ సభల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న వివరాలను స్పష్టంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా అధికారులు, బూత్ స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జగదీశ్వర్ రెడ్డి సూచించారు. ఓటు హక్కు అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా మండల కార్యాలయ సిబ్బంది, బీఎల్ఓలు తదితరులు ఆర్డీఓకు ప్రక్రియకు సంబంధించిన వివరాలను వివరించారు.

మంద కృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కమిటీ

విశ్వంభర, ఎల్బీనగర్ : మంద కృష్ణ మాదిగ ను ఎల్బీనగర్ నూతన కమిటీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ అసమానతలు లేని సమ సమాజాన్ని నిర్మించాలని తెలిపారు. సమాజం లో సమానత్వం కోసం ఉద్యమించాలి కోరారు. ఈకార్యక్రమంలో చంపాపేట్ అధ్యక్షులు బీసన్న మాదిగ, ఉపాధ్యక్షులు మహేష్ మాదిగ ,మన్సు రాబాద్ డివిజన్అధ్యక్షులు కాశీ మాదిగ, నర్రా శ్రీనివాస్, గండికోట భీంరాజ్, ప్రకాష్, రాజు, సురేష్, నరసింహ, నర్సింగ్ రావు, మౌలాలి మాదిగ, రాజు, క్రాంతికుమార్, దేవా, రాము, ప్రకాష్, రాజుకర్,మధు, సునీల్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ రెడ్డి డివిజన్ లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏర్పాటు

విశ్వంభర, వనస్థలిపురం : మందకృష్ణ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఎల్బీనగర్ నియోజకవర్గం బీఎన్ రెడ్డి డివిజన్ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏర్పాటు చేసి అనంతరం నియామక పత్రాలు అందజేశారు. నూతనంగా ఎన్నికైన వారిలో అధ్యక్షులుగా కొమ్ము లింగన్న, ఉపాధ్యక్షులుగా ఇరుగు లింగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఇరుగు మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా ఇరుగు వెంకటేష్, అధికార ప్రతినిధిగా వాడాకోలా శ్రీకాంత్, కార్యదర్శులుగా తలారి సతీష్, సహాయ కార్యదర్శులుగా కొమ్ము మల్లేష్, ఇరుగు వేణు ఉన్నారు.

మహేశ్వరంలో ఘనంగా కోట మైసమ్మ బోనాలు

విశ్వంభర, మహేశ్వరం : మహేశ్వరం మండల కేంద్రంలోని గడికోట అమ్మవారి బోనాలు గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి గ్రామంలో ప్రతి ఇంటి నుండి మహిళలు బోనం తీసుకొని అమ్మవారిని బోనం సమర్పించారు, గ్రామాన్ని చల్లగా చూడాలని ప్రతి ఒక్కరు వేడుకున్నారు, ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామంలో వివిధ పార్టీల నాయకులు గ్రామ పెద్దలు చిన్న పెద్ద తేడా అమ్మవారి దర్శనం చేసుకుని బోనాల కార్యక్రమాన్ని విజయవంతం చేశారు .

ఎటు చూసినా విధ్వంసం, వికృతం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో ఎటుచూసినా విధ్వంసం, వికృతమే కనిపిస్తుందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి ఆయన ఛార్జిషీట్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి సహా ఇతర నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి చేయకున్నా 4.50 లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. గురుదక్షిణ కింద కృష్ణా, గోదావరి నీళ్లను ఏపీకి తరలించే కుట్ర జరుగుతోందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

మీ పాలన క్రిమినల్ వేస్ట్..

కాంగ్రెస్ 1,000 రోజుల పాలనపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ఎటుచూసినా విధ్వంసం, వికృతమే తాండవం చేస్తున్నాయని మండిపడ్డారు. అన్ని రంగాల్లో సర్కార్ విఫలమైందని, కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన క్రిమినల్ వేస్ట్ అని ధ్వజమెత్తారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను దేశానికి అన్నపూర్ణగా మారిస్తే, కాంగ్రెస్ నాశనం చేసిందంటూ దుయ్యబట్టారు.

తెలంగాణకు అన్యాయం..

ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ కింద కృష్ణా, గోదావరి జలాలను తరలించుకుపోయే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా లేఖలు రాసిన వ్యక్తి (ఆదిత్యానాథ్ దాస్)ను సలహాదారుగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే ఊరుకోమని, మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. విద్యా వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి భ్రష్టు పట్టిస్తున్నారన్న కేటీఆర్, హెచ్‌సీయూ భూకుంభకోణంపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి 3 పువ్వులు, 6 కాయల్లా వర్ధిల్లుతుందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. లిక్కర్ బాటిల్ మూతల నుంచి మేడారం గద్దెల టెండర్ల వరకు అంతా అవినీతేనని ఆరోపించారు. భూమి కనబడితే సీఎం సోదరులు, బంధువులు భూతాల్లా వాలిపోతున్నారని విమర్శించారు. మాట్లాడితే కేసీఆర్ రాజీనామా చేయాలని అంటున్న సీఎం, ఆయన రాజీనామా చేస్తే దిల్లీ నేతలే తట్టుకోలేకపోయారని, మీరు తట్టుకుంటారా? అని ప్రశ్నించారు. సీఎం కోరిక మేరకే కేసీఆర్ 2028లో అసెంబ్లీకి ముఖ్యమంత్రిగా తిరిగివస్తారని తెలిపారు.

ప్రజల పక్షాన పోరాటం ..

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి మాజీ మంత్రి, శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ఛార్జిషీట్‌ను విడుదల చేశారు. పదేళ్ల పాటు కేసీఆర్ ఎంతో కష్టపడి దేశానికే తలమానికంగా తీర్చిదిద్దిన తెలంగాణ రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి సర్కారు పూర్తిగా కుప్పకూలుస్తోందని హరీశ్‌రావు ఆక్షేపించారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని అన్నారు. తెలంగాణను కేసీఆర్ కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యిలా ఇస్తే రేవంత్ రెడ్డి వ్యవస్థలన్నింటినీ ఆగం చేస్తున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి, ప్రజల పక్షాన పోరాడేందుకే వారం రోజుల కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు.

హామీల అమలులో..

కాంగ్రెస్ పాలనలో జరిగిన అరాచకాలు, వ్యవస్థల నిర్వీర్యం, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఛార్జ్‌షీట్‌ను ప్రజల ముందు ఉంచుతున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. దేశంలోనే అగ్రగామిగా నిలిచిన వైద్య రంగం నేడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం మందులు కూడా దొరకని దీన స్థితికి దిగజారిందని ఆరోపించారు. పురోగమనం వైపు వేగంగా ప్రయాణం చేయాల్సిన రాష్ట్రం, తిరోగమనం వైపు పయనిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమాలు..

మూడో తేదీన రైతు సదస్సుల రూపంలో సాగునీరు, విద్యుత్, యూరియా, బీమా సమస్యలపై ఆందోళనలు నిర్వహిస్తారు. హైదరాబాద్‌లో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్యపై నిరసనలు చేపడతారు. మహిళలకు ఇచ్చిన హామీల అమలు వైఫల్యంపై నిరసన కార్యక్రమాలు రూ.2500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అంశాలు లక్ష్యంగా నాలుగో తేదీన మహిళలు, వికలాంగులతో ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తారు. హామీలు అమలు చేయని ప్రభుత్వానికి నిరసనగా వంటావార్పు చేపడతారు. ఐదో తేదీన విద్యార్థులు, యువతతో నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహించి ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ అంశాలను ప్రస్తావిస్తారు.ఆదిలాబాద్, సింగరేణి ప్రాంతాల్లో ప్రత్యేక నిరసన సదస్సులు చేపడతారు. ఆరో తేదీన హైదరాబాద్‌లో నగర సమస్యలపై ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహిస్తారు. తాగునీరు, వీధిదీపాలు, ట్రాఫిక్, శాంతిభద్రతలపై పట్టణాల్లో పారిశుద్ధ్యం, పల్లెల సమస్యలపై గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతారు. ఏడో తేదీన ప్రజా వాణి కేంద్రాల్లో కాంగ్రెస్ హామీల వైఫల్యంపై వినతిపత్రాలు ఇస్తారు. హామీల మోసంపై జిల్లా, మండల కేంద్రాల్లో ప్రభుత్వానికి ఫిర్యాదులు చేస్తారు. వారం రోజుల పోరాట కార్యక్రమాలపై అన్ని జిల్లా కేంద్రాల్లో ఎనిమిదో తేదీన ప్రెస్ మీట్లు నిర్వహించడంతో పాటు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. సెప్టెంబర్ పదో తేదీన ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నిరసనలకు బీఆర్ఎస్ సంఘీభావం ప్రకటించింది. ప్రజా సమస్యలు, ఎన్నికల హామీల అమలు వైఫల్యాలను ప్రధాన అస్త్రాలుగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ఈ పోరుబాటను రూపొందించింది. మొత్తం కార్యక్రమాలను పార్టీ కేంద్ర కార్యాలయం ఎప్పటికప్పుడు సమన్వయం చేయడంతో పాటు ప్రతి కార్యక్రమంపై నివేదికలు తీసుకోనుంది.

బీజేపీ నాయకుడు సుధాకర్ తల్లి దశదిన కర్మ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఘన నివాళులర్పిస్తున్న వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణ, చైతన్యపురి కార్పొరేటర్ రంగ నర్సింహ గుప్త.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

కాంగ్రెస్ బాకీ కార్డు తో బీఆర్ఎస్ నిరసన

విశ్వంభర, సరూర్ నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన లో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో "కాంగ్రెస్ బాకీ కార్డు" కార్యక్రమం నిర్వహించారు.ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియం నుంచి కొత్తపేట వరకు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం వివిధ వర్గాల ప్రజలకు ఎంత బకాయి ఉందో వివరిస్తూ భారీ ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికార పీఠాన్ని దక్కించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. "అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని సుధీర్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మహిళలు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళను అర్ధరాత్రి దించేసిన రైలు సిబ్బంది..రూ.2లక్షల ఫైన్

విశ్వంభర,నేషనల్ బ్యూరో : రైల్లో ఓ మహిళకు ఎదురైన తీవ్ర అసౌకర్యానికి సంబంధించి కేరళ మానవ హక్కుల కమిషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. రిజర్వుడు టికెట్ ఉన్నప్పటికీ అర్ధరాత్రి వేళ మహిళను రైలు నుంచి దించివేయడాన్ని తీవ్రంగా పరిగణించిన కమిషన్.. బాధిత మహిళకు రూ.2లక్షల పరిహారం చెల్లించాలని రైల్వే శాఖను ఆదేశించింది. నెలరోజుల్లో ఈ మొత్తాన్ని చెల్లించిన అనంతరం ఆ విషయాన్ని లిఖిత పూర్వకంగా కమిషన్‌కు తెలియజేయాలని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే.. త్రిశూర్ జిల్లా ఎరుమపెట్టికి చెందిన జయస్మిత తిరువనంతపురంలో నివాసం ఉంటున్నారు. 2023 జులై 30న వడక్కంచెరి నుంచి తిరువనంతపురానికి ఆమె రైల్లో బయలుదేరారు. రిజర్వుడు టికెట్‌తో బోగీలోకి వెళ్లగా.. ఆమె సీటును మరొకరికి కేటాయించినట్లు గుర్తించారు. విషయాన్ని టీటీఈ దృష్టికి తీసుకెళ్లగా.. ఆ టికెట్ ఆన్‌లైన్‌లో రద్దైనట్లు జవాబు వచ్చింది. రైల్వేస్టేషన్‌లో తీసుకున్న టికెట్‌ను ఆన్‌లైన్‌లో ఎలా రద్దు చేస్తారని, తనకు తెలియకుండా ఎవరు చేశారని ప్రశ్నించినప్పటికీ అధికారి నుంచి సరైన సమాధానం రాలేదు. అయితే, రూ.500 చెల్లిస్తే మరో సీటు కేటాయిస్తానని టీటీఈ చెప్పినట్లు జయస్మిత పేర్కొన్నారు.అయితే, తనవద్ద అంత నగదు లేదని, అర్ధరాత్రి కావడంతో తనను రైలు నుంచి దించివేయవద్దని ప్రయాణికురాలు బతిమిలాడినా టీటీఈ వినలేదు. దాంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తదుపరి స్టేషన్ రాగానే ఆమెను దించివేసిన అధికారి.. ఆర్పీఎఫ్ సిబ్బందికి అప్పగించారు. టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న కారణంతో పోలీసులు ఆమెను అరెస్టు చేసి.. అనంతరం బెయిల్‌పై విడుదల చేశారు. దర్యాప్తు చేపట్టిన ఉన్నతాధికారులు.. రిజర్వేషన్ ఫారంలో ప్రయాణికురాలు ఇచ్చిన మొబైల్ నంబర్‌లో ఓ డిజిట్ తప్పుగా పడిందని, దాంతో సంబంధిత మెసేజ్‌లు మరోవ్యక్తి అందుకున్నట్లు గుర్తించారు. చివరకు ఆయనే ఆ టికెట్‌ను క్యాన్సిల్ చేసినట్లు నిర్ధరించారు. ఈ నేపథ్యంలోనే రైల్వేశాఖ ఆమెపై నమోదు చేసిన కేసును ఉపసంహరించుకున్నట్లు తెలిసింది.ఈ వ్యవహారంపై బాధిత రాష్ట్ర మహిళ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారించిన కమిషన్.. రైల్వే చట్టం ప్రకారం ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళను అర్ధరాత్రి వేళ దించివేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. బాధితురాలితో రైల్వే అధికారులు సరిగా వ్యవహరించలేదని పేర్కొంటూ రూ.2లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఇందుకు కారణమైన అధికారుల నుంచి ఆ నగదును వసూలు చేసుకోవచ్చని రైల్వేకు సూచించింది.

బాసర బ్రిడ్జిపై నుంచి పడి యువకుడి మృతి

విశ్వంభర, నవీపేట : నిర్మల్ జిల్లా బాసరలో విషాదం చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం కౌల్పూర్ గ్రామానికి చెందిన రమావత్ సాయికిరణ్ (25) గోదావరి నదిలో పడి చనిపోయాడు. యూకేలో ఎంబీఏ చేస్తున్న అతడు ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఈ నెల 5న తిరిగి యూకే వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం బాసర ఆలయానికి సాయికిరణ్ వెళ్లాడు. దర్శనం అనంతరం బ్రిడ్జిపై ఫొటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడు. విషయం తెలుసుకుని కుటుంబసభ్యులు గాలింపు చేపట్టగా బుధవారం అతడి మృతదేహం లభ్యమైంది. తండ్రి రమావత్ భోజారామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పీఎస్‌లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జపాన్, జర్మన్ భాషలతో ఎక్కువ ఉద్యోగావకాశాలు: మంత్రి వివేక్

ఢిల్లీ: విద్యార్థులు జపాన్, జర్మనీ భాషలను నేర్చుకుంటే.. ఆ దేశాల్లో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. అందుకే రాష్ట్రంలో వందలాది మందికి జర్మన్ భాష నేర్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. బుధవారం ఆయన దిల్లీలోని ఇందిరా భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. ''జపాన్, జర్మనీ పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడ పనిచేస్తున్న తెలంగాణ వాళ్లు కలిశారు. అక్కడ ఉపాధి అవకాశాలు చాలా ఉన్నాయని, అందుకు ఆ దేశాల భాషలు రావాలని చెప్పారు. అందుకే ప్రభుత్వం విదేశీ భాషలను, నైపుణ్యాలను నేర్పిస్తోంది. టామ్‌కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో మన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది.వెయ్యి రోజుల పాలనలో ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసింది. రుణమాఫీ, ఉచిత విద్యుత్తు, సన్నబియ్యం, 17 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇలా అనేక హామీలను నెరవేర్చింది. నైరాశ్యంలో కేటీఆర్, హరీశ్‌రావు ఒకరికి మించి ఒకరు ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. వారి మధ్య ఉన్న ఆధిపత్య పోరును కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు'' అని మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు.

వైభవంగా మణిద్వీప వర్ణన పూజ

విశ్వంభర, సరూర్ నగర్ : వాసవీ కాలనీలోని అష్టలక్ష్మి మహిళా మండలి చైర్మన్ తమ్మన సుజాత ఆధ్వర్యంలో మణిద్వీప వర్ణన పూజను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. సుమారు 500 మంది మహిళా భక్తులు ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో మణిద్వీప వర్ణన పూజ నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం మణిదీపాల కాంతులతో, ఆధ్యాత్మిక వాతావరణంతో శోభిల్లింది. శ్రీ వాసవీ మాత అమ్మవారి కృపాకటాక్షాలు సమస్త కుటుంబాలపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గౌరిశెట్టి చంద్ర శేఖర్, చిలుక మధుర ఉపేందర్ రెడ్డి, కొరివి నవీన్ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తి, ఐక్యత, సత్సంప్రదాయాలను మరింత బలోపేతం చేస్తూ, భవిష్యత్తులో కూడా మరింత వైభవంగా కొనసాగాలని ఆకాంక్షించారు.అష్టలక్ష్మి మహిళా మండలి ప్రణవి శ్రీరామ్, వెంపటి జ్యోతి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ నియామక పత్రాల అందచేత

విశ్వంభర, చైతన్యపురి : పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల నిర్మాణ పక్రియలో భాగంగా మున్సిపాలిటీ కాలనీలో కోళ్లరు శ్రీహరి ఆధ్వర్యంలో బుధవారం కమిటీ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం ఇంచార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ హాజరై ఉద్యమ అవశ్యకత, ప్రస్తుత పరిణామాలు, నాయకుల కర్తవ్యాలు, భవిష్యత్ లక్ష్యాలు వివరించి ఎమ్మార్పీఎస్ కమిటీ ప్రకటించడం జరిగింది. అనంతరం మంద కృష్ణ మాదిగ సందేశాన్ని వివరిస్తూ నూతన కమిటీని ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు. నూతన కమిటీ లో భాగంగా చైతన్యపురి డివిజన్ అధ్యక్షులుగా చిత్రం పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి గా కళ్యాణ్ బాబు,ఉపాధ్యక్షులుగా కృష్ణ తేజా, కోశాధికారిగా కొల్లూరి వినోద్,ప్రధాన కార్యదర్శిగా బంటీ, ఉపాధ్యక్షులుగా కిట్టు,శివ ,కార్యదర్శులుగా అభిషేక్, శశి, వినోద్, సహాయ కార్యదర్శిలుగా కార్తీక్ బాబు, అవినాష్ ఎన్నికైనారు.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా "విశ్వంభర" తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108